యిక్కడ భోజనం చేయవని చెప్పాను - ఎనభై యిస్తార"ని చెప్పాక మీరా తెల్లబోయింది.

ఓ రోజు శాంతమ్మగారింటిదగ్గరనుండి యింటికెళ్తోంటే దారిలో జానకి కనపడి, "ఏమిటి సంగతులు, ఎలా వుందక్కడ?" అని అడిగింది.

"సంగతులు ఏంలేవుగాని అసలు బొత్తిగా పనిలేదక్కడ. మా యింట్లో వున్నంత పని కూడా లేదు. ఒక్కొక్కసారి అనిపిస్తుంది డబ్బు ఎక్కువ వుండి పెట్టుకున్నారా అని" అంది.

"పెద్దగా పనేం వుండదు. నేను మొదటే చెప్పానుగా! ఆవిడకి సహాయంగా వుండాలి. ఒక్కదానికే తోచదు ఒకటి, గుండెదడ మనిషి - నిన్న మధ్యాహ్నం వచ్చేను. అప్పటికి యింకా నువు రాలేదు."

"ఆవిడ ఏమన్నారు?" తన గురించి ఏం చెప్పిందా అని ఆతృతగా అడిగింది మీరా.

"ఏమంటారు" నవ్వింది జానకి. "నువ్వు చాలా పనిమంతురాలివేగాక బుద్ధిమంతురాలివట! ఈ కాలంలో పుట్టవలసినదానివి కాదుట."

మీరా తేలిగ్గా వూపిరి పీల్చుకుంది. "పోనీ! ఆవిడకు యింక మనిషి అవసరం లేదు - వద్దూ అనుకొనే వరకూ తను అక్కడే వుంటుంది. తనకీ యిక్కడకి వచ్చినప్పటినుంచీ నిశ్చింతగా వుంది. తల్లి ఓ మూల ముడుచుకుని పడుకుంటే తనోచోట నిముషాలు లెక్కపెట్టుకుంటూ కూర్చునేది - ఏ పని అయితేనేం" అనుకుంది మీరా.

మళ్ళీ జానకి అంది "ఆ అమ్మాయికి యిక్కడ వుండడానికి కుదరదు కాని వుంటే నాకు చాలా కాలక్షేపం అవును అన్నారు. నీకు వీలున్నప్పువల్లా అక్కడే గడుపుతూండు" అంది.

"అలాగే" అంది మీరా. జానకి వెళ్ళిపోయింది.

జానకి చెప్పింది అక్షరాలా నిజం! కన్నతల్లికన్నా అభిమానంగా ఆప్యాయంగా మాట్లాడుతుందావిడ. ఈ ఊళ్ళో యింతకన్న మంచి ఉద్యోగం దొరకదు. నిజంగా ఈ పరిస్థితుల్లో యిది తన అదృష్టమే! తను యిలా రావడంతో అమ్మ విజయ్‌ని దగ్గరకి తీస్తోంది.

*　　*　　*　　*

నెలరోజులు గడిచిపోయినాయి. మీరా సాధ్యమైనంత వరకూ పన్నెండింటికి యింటికొచ్చేసి మళ్ళీ రెండు గంటలకే వచ్చేస్తోంది.

ఒకసారి మాటల్లో కాంతమ్మగారంది "ఇంత యిల్లుంది. మీ అమ్మగారిని తీసుకుని యిక్కడకి వచ్చేయకూడదూ, మీరా."

మీరా శాంతమ్మగారు అదివరకు ఒకటి రెండుసార్లన్నప్పుడు "ఎందుకండీ" అంటూ నవ్వి తప్పించుకుంది.

శాంతమ్మగారు "ఏం మీ అమ్మగారు ఒప్పుకోలేదా? ఒకసారి చూడ్డానికన్నట్లు తీసుకురా! నేను చెప్తానావిడకి" అంది.

"అబ్బే! ఎందుకండీ."

"నీకూ చాలాదూరం. ఇంత దూరం నడవద్దూ!"

"అది కాదండీ! అమ్మకి నేనిలా జేరినట్టు తెలియదు" అంటూ తను తల్లికి ఏమని చెప్పి జేరింది అంతా, "నేను పిల్లలకి పాఠాలు చెప్పుకుంటాననే అనుకుంటోందండి. అసలు దానికే అమ్మ ఒప్పుకోలేదు" అని చెప్పింది.



# అంతరాలు అంతర్యాలు

## శేషపిళ్ళె

సాధారణంగా ఎంతో రిజర్వుడుగా వుండే మా పిల్లలు కొత్తయింట్లో దిగి పన్నెండు గంటలన్నా కాకముందే ఎదిరింటి పిల్లల్తో అంత హుషారుగా కలిసిపోయారంటే నాకెంతో ఆశ్చర్యం వేసింది. ఆ వూళ్ళో కొత్తగా జూనియర్ కాలేజీ వోపెన్ చేశారు. నన్ను యు.డి.సిగా అప్‌గ్రేడ్ చేసి పోస్టు చేయడంతో కుటుంబంతోసహా ఆ యింట్లో దిగాను.

అది పెద్ద బస్తీగానీ — పల్లెటూరుగానీ కాదు. కొత్తవాళ్ళు వచ్చారంటే చుట్టుప్రక్కల వాళ్ళు రావడం—పూర్వాపరాలు విచారించడం వీలైనన్ని ఆరాలు తీయడం ఆనవాయితే మరి. బస్తీలోనైతే పెద్దగా పట్టించుకోరు. వచ్చి గంటసేపన్నా కాకముందే చుట్టుపక్కల వాళ్ళంతా వచ్చి మంచీచెడ్డా విచారించి వెళ్ళారు. అందరూ వచ్చి వెళ్ళాక విజయ వచ్చింది.... విజయ ఎదురింట్లో వుండే ఆ పిల్లల యొక్క అదే మా పిల్లల కొత్తఫ్రెండ్సు యొక్క అమ్మ. ఆవిడ వచ్చి విచారించిన తీరే ఓ మోస్తరుగా వుంది. మేమంతా కాఫీ తాగుతూన్న సమయంలో బయట తలుపు మెల్లగా నాజూగ్గా తట్టారు ఎవరో. వెళ్ళి మా ఆవిడ తలుపు తీసింది. ఎత్తుకు తగినంత సన్నగా— ఆకుపచ్చని షిఫాన్ చీర-అదే రంగు బ్లవుజు-మెడలో సన్నని గొలుసు-కుడిచేతికి వాచీ— ఎలాంటి వ్యక్తినన్నా మొదటి చూపుతోనే ఆకట్టుకొనే చక్కని పర్సనాలిటీ-మత్తెక్కించే ఆ కళ్ళు-సన్నని నాజూకైన వ్రేళ్ళు-అందమంతా ఒకేచోట కుప్పపోసినట్టుండే ఆవిడని మళ్ళీ మళ్ళీ చూడాలనిపించినా సభ్యత కాదేమోనని చూపులు వెంటనే మరల్చుకొన్నా. రెండు చేతులూ జోడించి "నమస్కారమండీ! ఎదిరింట్లో వుంటున్నాన్నేను. నా పేరు విజయ. మావారు ఆర్మీలో వుంటున్నారు. సామాన్లు సర్దడంలో సాయం కావల్సివస్తే చెప్పండి. మొహమాట పడకండి" ఆ గొంతులో వేయి వీణలు మీటినట్టు-కోటి రాగాలు ఆలపించినంతటి ఆకర్షణ వుంది. 'థాంక్సండీ! సర్దుకొంటాంలెండి' అని మా ఆవిడ సరిత ఒకవేపు చెబుతున్నా విజయ యెంతో చొరవగా వుషారుగా దాదాపు రెండు మూడు గంటలసేపు మాతో వుండి అంతా సర్ది వెళ్ళింది. ఆ సాయంత్రానికే పాలవాడిని-పెరుగువాడిని-కూరలమ్మిని-పనిమనిషిని పరిచయంచేసి నెల కాతా మీద కుదిర్చి వెళ్ళింది. విజయ అలా పరిచయమైంది మా కుటుంబానికి.

ఆలోచనలు మాని నా ముందు బల్లమీద పడివున్న వుత్తరాన్ని మళ్ళీ మళ్ళీ చదివాను.

అందులో ఒక్కో అక్షరం నా వ్యక్తిత్వాన్ని నా డిగ్రీని-సమాజంలో నాకున్నదనుకొనే గౌరవ ప్రదమైన స్థానాన్ని సవాలు చేస్తున్నట్టుంది. నా చూపులు దూరంగావున్న గోడమీద పడ్డాయి. రెండు పెద్ద బల్లులు....బాగా పెద్దవి... మరో చిన్నబల్లిని తరుముతున్నాయి. చిన్నబల్లి ప్రాణభయంతో పరుగెడుతూంది. పరుగెడ్తూ-పరుగెడ్తూ తటాలున అది నాలుక చాపి గోడమీద వున్న ఈగను గబుక్కున మింగేసి మళ్ళీ పరుగు లంకించుకుంది. ఒకవేపు ప్రాణం కాపాడుకోడానికి పరుగెత్తుతూ మరోవేపు ప్రాణిని నిర్దాక్షిణ్యంగా మింగేసిన ఆ చిన్నబల్లి మనస్తత్వం, చూసి నాకు ఆలోచనలు పరిపరి విధాలుగా పరుగులు తీయడం ప్రారంభించాయి.

ఆలోచనలు మళ్ళా వెనక్కి మళ్ళాయి. ఆ యింట్లో చేరిన రెండు మూడు రోజులకే విజయ విషయం చూచాయగా తెలిసివచ్చింది. ఆ రెండ్రోజుల్లో ఆ వీధిలోని అమ్మలక్కలంతా మా యింటిని సెంటర్‌గా చేసుకొన్నారు. కలిసికట్టుగా అంతా విజయపై పితూరీలు చెప్పడం. ఆవిడ గాలి సోకితేనే తామెంతో అపవిత్రురాలై పోయేట్టు ప్రవర్తించడం మొదలుపెట్టారు. సరితగాని-నేనుగాని వాళ్ళ మాటల్ని కాతరు చేయలేదు. మరికొన్ని రోజులు గడిచేసరికి హెచ్చరికలు రావడం మొదలయింది. "ఆ సానిదాంతో మరీ అంత క్లోజ్‌గా వున్నారేమండీ. పచ్చని మీ కాపురంలో నిప్పు పోస్తుందండోయ్. జాగ్రత్త. చేతులు కాలాక ఆకులకోసం ప్రాకులాడినట్టవుతుంది." సరిత ఎప్పటిలా చిరునవ్వు నవ్వేసరికి వాళ్ళకి ఒళ్ళు మండేది పాపం. మరో వారం తిరిగింది. ఇటు విజయ మాకెంతో దగ్గరవుతూంటే అటు ఆ వీధిలోని మిగతా వాళ్ళంతా అంత దూరమయిపోయారు. క్రమక్రమంగా మా యింటికి రావడం....మాతో మాటాడ్డం మానేశారు. విజయకు ఈ విషయాలన్నీ తెలిసినా తెలియనట్టే వస్తూపోతూ వుండేది.

ఏ విషయంలోనూ-సరితకూ, నాకూ యీ పదేళ్ళ కాపురంలో ఎప్పుడూ అనుమానాలూ-అభిప్రాయభేదాలూ రాలేదు. విజయ విషయంలోనూ అంతే.


మా పిల్లలు విజయను అత్తయ్యా అనీ.... వాళ్ళ పిల్లలు నన్ను మామయ్యా అనీ.... మా సరితను అత్తయ్యా అనీ చుట్టరికం కలిపి పిలిచేవారు. కారెక్టర్‌లేని ఆడదని వూరంతా వెలివేసినట్టు ప్రవర్తిస్తుంటే మేం మాత్రం విజయను ఎంతో దగ్గరికి చేరదీయడం చూసి అక్కడక్కడా గుసగుసలు వచ్చినా మేం పట్టించుకోడం మానేశాం. సరిత, నాతో అప్పుడప్పుడనేది. "విజయ వయస్సులో వున్న ఆడది. పాపం భర్త ఎక్కడో ఊహకందని దూరంలో వుంటుంటే యిక్కడ తాను తెలిసో తెలియకో పొరబాటే చేసిందనుకోండి. ఆ మాత్రం తప్పుచేయని వాళ్ళెవరండీ. కాకుంటే ఒకొక్కళ్ళు వొకోరకం తప్పులు చేస్తూంటారు గాని. ఆడదానికి ఆడదే శత్రువంటే అతిశయోక్తి కాదండీ. చూడండి అవిణ్ని కాకుల్లా పొడిచేస్తున్నారు. పాపిష్టి మూక!" సరిత విశాల హృదయాన్ని - పరిస్థితుల ప్రాభవాన్ని అవగాహన చేసుకొనే సునిశిత అంతరంగాన్నీ ఎంతో మెచ్చుకొనేవాణ్ని.

ఆటల్లోగాని మిగతా సమయాల్లోగాని సాధారణంగా పిల్లలమధ్య యేర్పడే తగవులు కూడా మా రెండు కుటుంబాల్ని విడదీయలేకపోయాయి. అటు విజయ-ఇటు సరిత ఎప్పటికప్పుడు తగవుల్ని త్రుంచేసే వాళ్ళు. సరిత వాళ్ళపిల్లల్ని-విజయ మా పిల్లల్ని వెంటేసుకొని వచ్చి సర్దేయడం మామూలై పోయింది. దాంతో పిల్లలు మానసికంగా మాకు మరీ దగ్గరయ్యారు.

విజయ ఆలోచనలు - ప్రవర్తనా అదో ధోరణిలో వుండేవి. ఆవిడ దేన్నీ సీరియస్‌గా తీసుకొనే రకంకాదు. అదీ ఒకందుకు మంచిదే అయింది. లేకుంటే ఆ వీధిలోనేగాదు....ఆ వూళ్ళోనే విజయలాంటి ఆడది బ్రతకటం కష్టమనిపించింది నాకు. సాయంత్రం కాలేజీనుండి రావడంతోటే మా పిల్లలు నన్ను చుట్టుముట్టి రకరకాలుగా వూసులాడుతుంటే పాపం చిట్టి-








నానీ దూరంగా నుంచొని బిక్కుబిక్కుమని చూస్తూండేవాళ్ళు తొలిరోజుల్లో. అమాయకమైన ఆ కళ్ళల్లో....మనకూ మన నాన్నగారు దగ్గరుంటే....మనం కూడా యిలాగే సాయంత్రానికల్లా....అన్న తీయని ఆలోచనల్ని చదవగలిగాను. వాళ్ళనీ దగ్గరకు తీసి మా పిల్లల్తోబాటు వాళ్ళ కబుర్లూ వినడంతో వాళ్ళకు నేనంటే అదోరకం భక్తి-ఆప్యాయత పెరిగాయి.

రెండునెల్లు గడిచేసరికి విజయ గురించి మరికొన్ని చేదునిజాలు తెలిశాయి. విజయకి ఆ సరికే ఓ పెళ్ళయిందట. అడవిమనిషిలాంటి అతడితో సంసారం చేయలేక విజయ అవూళ్లోనుంచి మిలిటరీలో చేరిన ఒకతను సెలవుల్లో రాగా అతన్తోబాటు ఈ వూరు లేచివచ్చేసిందట. కానీ యిప్పుడు ఆ మిలిటరీ ఆతను కూడా సరిగ్గా చూట్టంలేదనీ-అందుకే విజయ అందమైన తన వొంటిని అమ్ముకొని బతుకుతుందని తెలియవచ్చింది. సరితకే విజయపట్ల మరింత జాలి పెరిగిందేగాని ఏ మాత్రం తగ్గలేదు.

సరిత వాళ్ళ నాన్నకి సుస్తీ చేసిందని అర్జంటుగా తీసుకురమ్మన్నారనీ వాళ్ళ తమ్ముడు ఓ రోజు ఉదయం వచ్చి సరితను ఆ రోజు సాయంత్రానికే తీసికెళ్ళిపోయాడు. పిల్లలకి కూడా పరీక్షలై పోవడంతో ఆ పర్యాయం సరిత పుట్టింట్లోనే రెండునెలలు గడిపేసింది.

కొన్ని పరిస్థితులు- అవసరాలు మానవుణ్ణి బలహీనుణ్ణి చేస్తాయి. పరిస్థితుల ప్రభావం నుండి బయటపడ్డం అంత తేలికైన సంగతేం కాదు. ఒక నిండు జీవితకాలం ఆదర్శాలకూ ఆశయాలకూ కట్టుబడ్డా....జీవితంలో ఎప్పుడో వొకప్పుడు మానవుడు పతనమైపోతుంటాడు. ఆ పతనం కావడానికి నెల్లూ-సంవత్సరాలూ అక్కర్లేదు. కొన్ని క్షణాలు చాలు. అతణ్ని అధఃపాతాళానికి త్రొక్కేస్తాయి. అయితే ఆ కొన్ని క్షణాలే గనుక అతడు పరిస్థితుల్ని—ఆకర్షణల్ని—అవసరాల్ని తట్టుకొని నిలబడ

గలిగితే-పరిస్థితుల్ని జయించిన విజేత అవుతాడు. అలా ఎందరు తట్టుకోగలరనేది ఆలోచించదగ్గ సంగతే మరి.

ఉన్నట్టుండి వులిక్కిపడ్డాను. సరిత వూరి కెళ్ళిన సమయంలో....ఆ రోజు....నా జీవితంలో ఓ కాళరాత్రి....ఉక్కపోతకు భయపడి ఆరుబయట వరండా ప్రక్క మంచం వేసుకొని పడుకున్నా దక్షిణంవేపు నుండి కొబ్బరి చెట్లమీదుగా చల్లని పైరగాలి- ఆకాశంలో చక్కని చిక్కనైన వెన్నెల-ప్రక్కనే బాగా విచ్చుకొన్న మల్లెతీగలు-సరిత మీదకి మనస్సు మళ్ళింది. సరితను గూర్చిన తీయని ఆలోచనల్లో ఎప్పుడో నిద్ర పట్టేసింది. ఒక రాత్రి వేళ....అటు తిరిగితే....ఏదో చక్కని స్పర్శ. మెత్తగా....వేడిగా వుండే అవయవాలు నా ఛాతికి తగిలి గిలిగింతలు పెట్టాయి. నెలరోజులుగా ఆ స్పర్శకే .... ఆ వేడికే....వళ్ళంతా తపించిపోతున్న నేను....ఉలిక్కిపడి బలవంతంగా కళ్ళు తెరిచి చూశాను. మైగాడ్! నా ప్రక్కన వున్నది సరిత కాదు....విజయ!

అవును విజయే. ఎవరి అందమైతే మొదట్లో నన్ను వుక్కిరి బిక్కిరి చేసిందో ఆ విజయే.... ఎవరినైతే సొంత చెల్లెళ్ళు లేని నేను సొంత చెల్లెలికన్నా మిన్నగా యిన్నాళ్ళు భావించానో ఆ విజయే....నేను ప్రయత్నించకుండానే.... నా ప్రక్క....నా మంచం మీద .... చక్కని వెన్నెల్లో....సరిత లేనప్పుడు వొంటరిగా.... విజయ నాకా క్షణం చెల్లెల్లా కనిపించలేదు. విజయ నా క్కావాలి. విజయను వదలిపెట్టలేను. ఎందరి చేతుల్లోనో నలిగినా యింకా బిగువు సొంకం సడలని విజయ వళ్ళు....ఆకర్షణ.... అందం అనుభవించడానికే గాని ఆరాధించడానికి గాదనే విజయ మనస్తత్వం ...ఆవిడ ప్రవర్తనా నన్ను పిచ్చివాణ్ణి చేశాయి. ఎడంచేత్తో విజయను దగ్గరగా తీసుకొని....మరెక్కడికైనా పారిపోతుందేమోనన్నట్టు గట్టిగా ఆవిణ్ణి బంధించేశాను. కిలకిల నవ్వుతూ .... మరో క్షణంలో అనుకూలంగా తయారైన విజయ పైకి వాలిపోయాను. నాలుగు గంటల రాత్రి వుండొచ్చు సుమారుగా! చీర సర్దుకొంటూ పైకి లేచింది విజయ. వరండాలో, హేంగర్‌కి వ్రేలాడుతూన్న షర్టు దగ్గరికి నడిచి....పాతిక రూపాయలు తెచ్చి నాకు చూపిస్తూ "యిది నా రేటు ..." అంటూ గబగబా నాలుగడుగులు ముందుకువేసి మళ్ళి వెనక్కి వచ్చి "రాత్రి కూడా రానా?" అని అడిగింది.

విజయతో గడిపిన ఆ రెండు గంటల అనుభవం నా కెంతో తీయగా—అడ్వంచరస్‌గా— మళ్ళీ మళ్ళీ కావాలనుకొనే అనుభవంగా అనిపించింది. చిన్నప్పుడు యింట్లో గంపల నిండుగా మామిడి పళ్ళున్నా....ఊరి వెలుపల తోటలోకి దొంగతనంగా చొరబడి కాయలు కోసి తెచ్చుకొని దూరంగా బండమీద కారం, ఉప్పూ కలిపి నూరి తింటుంటే కలిగే ఆనందం లాంటిదే యిది అనిపించింది. తప్పు....తప్పు! ఈ రెంటినీ తేలిగ్గా సరళరేఖ గీసి విడదీసి నిర్వచించలేం. ఆకలి తీరేందుకు మరో ప్రాణిని చంపితే పాపంలేదు .... అది హింస కాదు. అలాగే యిదిన్నీ....ఈ ఆలోచన రావడం.... మరుక్షణం వొక నిర్ణయానికొచ్చి అలాగే రమ్మన్నాను విజయను. రెండు మూడు రోజులకోసారి విజయతో....గమ్మత్తుగా గడిచింది.

సెలవులైపోయాయి. మరో రెండ్రోజులకు సరిత వస్తుందనగా ఆ రోజు రాత్రి విజయతో అన్నాను. 'సరిత వచ్చేస్తుంది రెండ్రోజుల్లో.' చమత్కారంగా కళ్ళు తిప్పుతూ అడిగింది విజయ. "అయితే నన్ను రావద్దనేగా మీరనేది" "నో నో....మా ఇంట్లో....అదే నేనే మీ ఇంటికి వస్తుంటాను. రెడీగా వుంటావు గదూ" అర్థింపుగా వుంది నా గొంతు. విజయ అవుననలేదు. కాదనలేదు. మౌనం అంగీకారమనుకొన్నా.

సరిత శనివారం వచ్చేసింది. ఇకమీద విజయ మా యింటకి యింత క్రితంలాగా ఫ్రీగా రాదనుకొన్నా.... కాని విజయలో ఎలాంటి మార్పులేదు. విజయ వస్తూపోతూ వుంటే.... కళ్ళతోనే విజయను నగ్నంచేసి నాకు కావలసిన కోణంలోంచి చూసి తృప్తిపడే వాడిని. ఏదో సందర్భంలో సరిత కళ్ళుకప్పి విజయను





తాకాలని ప్రయత్నించాను. ఇదో రకం ఆకర్షణ. దీన్ని తప్పించుకోలేనేమో ననిపించింది. ఒకసారి రుచి మరిగాక మనిషి ఒకపట్టాన కొన్ని ఆకర్షణల నుండి దూరం కాలేడు.... దానికి బానిసై పోతాడు.

ఆదివారం సినిమాకెళ్ళాం. ఆ రాత్రి సరిత పక్కనేవున్నా నాలుగైదుసార్లు మనసు ఎటో తిరగసాగింది. తెల్లవారింది .... సోమవారం. ఉదయం....ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది.. గంటలు గడుస్తున్నా విజయ కానరాలేదు. ఎదిరింట్లో అలికిడి లేదు. నానీ-చిట్టీల సందడి కూడా ఏమాత్రం లేదు. కాలేజీకి వెళుతుంటే సరిత చెప్పింది విజయ యిల్లు ఖాళీచేసి మరో వూరెళ్ళిపోయిందని. నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను. విజయ అందమైన కళ్ళు.... ఆ చక్కని సన్నని నడుం....ఆ శంఖంలాంటి మెడ....ముత్యాల్లాంటి పళ్ళు... గత జ్ఞాపకాలతో వళ్ళు వేడెక్కిపోసాగింది. మనస్సు గజిబిజిగా వుంది....పాపం విజయ! ఎందుకు ఖాళీచేసినట్టు. కొంపదీసి నాకోసం కాదుగదా! డబ్బుకోసం కక్కుర్తిపడే విజయలాంటి వాళ్ళు ఎవరైతేనేం అనుకొంటారుగాని అనుకొని సర్దుకొన్నాను.

బుధవారం వుదయం పోస్ట్ వచ్చింది. వచ్చిన వుత్తరాల్లో ఒకటి పైన 'పర్సనల్' అని వ్రాయబడివుంది. అడ్రసులోని అక్షరాలు ముత్యాలు కూర్చినట్టు పొందిగ్గా వున్నాయి. ఆదుర్దాగా చించాను. ఊరిపేరు లేదుగాని క్రింద విజయ అన్న సంతకం వుంది. కవరు త్రిప్పి పోస్టల్ ముద్ర చూశాను. సరిగ్గా కానరాలేదు. ఆసరికే కనీసం ఓ పదిసార్లన్నా చదువుకొన్న ఆ వుత్తరాన్ని మరోసారి చదువుకొన్నా....

డబ్బుకోసం వళ్ళు అమ్ముకొనేదాన్ని. కాదన్ను. మీ ఆవిడ వూరంతా అసహ్యించుకొన్నా నన్ను చేరదీసింది. ఎడారిలో ఒయాసిస్‌లా....ఈ ఆర్నెల్లూ జరిగింది. డబ్బు అవసరం నన్ను ఆ రోజు రాత్రి మీ దగ్గరకు తరిమింది. అప్పుగా మీ వద్ద పుచ్చుకోడానికి నాకు మనస్కరించలేదు. నాకు తెలుసు. దొంగచాటుగా కొని తెచ్చుకొనే అనుభవాల్ని మగవాళ్ళు ఒకపట్టాన వదలిపెట్టలేరు కొందరు. అందుబాటులో వుంటే మరీను. అందరి మగాళ్ళకు మల్లే మీరు ఓ మగాడికిందే లెక్క.... లేకుంటే మీ యింటికే వస్తాను, రెడీగావుండు అనేవారు కాదు. నాకు తెలుసు. మీరు సరితను ముత్యాల్లాంటి అమాయకులైన బిడ్డల్ని అన్యాయంచేసి ప్రతిసారీ పాతికరూపాయలతో నా దగ్గరకు రావడానికి ప్రయత్నిస్తారు. ఒక ఆడది మరో ఆడదాని వొళ్ళో అందులో సరితలాంటి వాళ్ళో నిప్పులు పోయకూడదు. నాకూ ఓ నీతి వుంది....నియమం వుంది. అంతకన్నా కృతజ్ఞత వుంది. శాశ్వతంగా యీ వూరే వదలి వెళ్ళిపోతున్నా. కొందరు అందుబాటులో వుంటే అనుభవిస్తారుగాని వాటికోసం చెడు తిరుగుళ్ళు తిరిగి సాహసాలు చెయ్యరని నాకు తెలుసు. పాపం....చంటి పిల్లల్లాంటి వాళ్ళు. ఏడ్చి అల్లరిచేస్తేగాని అమ్మ పెట్టదని చంటి పిల్లకూ తెల్సుగాని....వీళ్ళు యింకా అమాయకులనే అనాలి. వాళ్ళ కోవలోకి చెందుతారు మీరు నిస్సందేహంగా. దయచేసి జరిగిందంతా ఓ పీడకలలా అనుకోండి. చక్కగా ఎప్పటిలా కాపురం చేస్తారు గదూ!

మీకేకాదు....ఎవరికీ ఎప్పుడూ
ఏమీ కాని, కాకూడదనుకొనే...."

విజయ.

నిజమే! అందమైన అనుభవాల కోసం.... అందుబాటులో వుంటేగాని సాహసించి ప్రయత్నించే మనస్తత్వం కాదు నాది. ఎంత చక్కగా అంచనా వేసింది విజయ! డబ్బుకు మొగం వాచివున్నా తనకూ ఓ నీతి వుందనీ—వుండడమే కాదు....దాన్ని ఆచరణలో పెట్టగలిగిన నేర్పు, ఉదారగుణం కూడా తనలో వుందని నిరూపించుకొన్న విజయ....నా కన్నా ఎన్నో రెట్లు....ఉన్నతంగా....అందని శిఖరాల మీద వున్నట్టనిపించింది. 'ఎక్కడి నుండి వచ్చిందండీ ఆ వుత్తరం....' అన్న సరిత వాక్యాల వెనుక మరేం అడిగిందో వినిపించలేదు ఆ క్షణం.

□